

షీ బాక్స్ ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏపిజేఏసి అమరావతి -చిత్తూరు మహిళా విభాగం వారి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగుల ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయగా గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ఏపిజేఏసి చిత్తూరు జిల్లా మహిళా విభాగం ప్రెసిడెంట్ జయంతి, జనరల్ సెక్రెటరీ లత, కొఛైర్మన్ శోభ, మెంబర్ సెక్రెటరీలు సరిత, పుష్పలత పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగుల ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసి

నాటుసారా వల్ల కలిగే అనార్థాల పై
ప్రజలకు అవగాహన కల్పించాలి: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా నాటుసారాను పూర్తిగా నిర్మూలించడానికి ప్రణాళికలను సిద్ధం చేసిందని, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నాటుసారా రహిత సమాజం దిశగా నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై కలెక్టర్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలుతో కలసి ఎక్సైజ్, పోలీస్, ఫారెస్ట్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా వినియోగం వల్ల కలిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి, తయారీదారులు, వినియోగదారులలో మార్పు తీసుకురావాలన్నారు. జిల్లాలో చిత్తూరు అర్బన్, రూరల్, కార్వేటినగరం, నగరి, పుంగనూరు, కుప్పం, పులిచెర్ల మండలాలలో 52 గ్రామాలలో నాటుసారా తయారీ, వినియోగం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా ఎ కేటగిరీ కింద నాటు సారా తయారు చేసి ఇతర ప్రాంతాలలో అమ్మే 8 గ్రామాలను, బి కేటగిరీ కింద సారా తయారు చేసి అదే ప్రదేశాలలో వినియోగించే 17 గ్రామాలను, సి కేటగిరీ కింద ఇతర గ్రామాల నుండి అక్రమ రవాణా చేసి అమ్మకం జరిపే 27 గ్రామాలుగా విభజించడం జరిగిందన్నారు. కేటగిరీ వారీగా ఉన్న గ్రామాలకు ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులను నియమించి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. నాటుసారా తయారీదారులను గుర్తించి కళాజాతలు, గ్రామ సభలు, గోడపత్రికలు, కరపత్రాలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీఓల ద్వారా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. విఆర్‌ఓ, విఆర్‌ఏలు గ్రామాలలో నాటుసారా అక్రమ తయారీ, నిల్వ, అమ్మకం జరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే సంబంధిత ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. నిర్మానుష్యమైన అటవీ ప్రాంతాలలో కూడా సారా తయారీ చేసే అవకాశం ఉన్నందున అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నాటుసారా తయారు చేసే వారికి ప్రత్యామ్నాయంగా జీవనోపాధులు కల్పించడానికి నైపుణ్యాభివృద్ధి పెంపుకు చర్యలు చేపట్టి, స్వయం ఉపాధి కింద అవసరమైన ఆర్థిక సహాయంను బ్యాంకులతో సమన్వయం చేసుకుని రుణాలు అందించాలని డిఆర్డిఏ అధికారులను ఆదేశించారు. నాటుసారా తయారీ, రవాణా, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు ఫోన్ చేసి తెలపాలని ప్రజలను కోరారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకం, రవాణాపై సంబంధిత శాఖలతో కలసి పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని తెలిపారు. చట్టరీత్యా నేరమైన నాటుసారా తయారీ, అమ్మకాలు, తదితరాల కారణాల వలన పట్టుబడితే జరిమానాలు విధించడం జరుగుతుందని, తరచూ ఇటువంటి చర్యలకు పాల్పడితే పిడి యాక్ట్ కింద కేసులు బుక్ చేస్తామన్నారు. ఈ సమావేశానికి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఎఫ్‌ఓ భరణి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తహశీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు హాజరయ్యారు.

పారిశుధ్య కార్మికుడి మృతికి నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న వి.మోహన్ మృతికి నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పి.లోకేష్‌లు నివాళులు అర్పించారు. మిట్టూరు మాస్టర్‌లో విధులు నిర్వహించే మోహన్ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. కమిషనర్, ఎంహెచ్‌ఓ, శానిటరీ ఇన్స్పెక్టర్లు సంతపేటలోని మృతుడి నివాసానికి వెళ్లి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరపున మట్టి ఖర్చుల కింద రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. నగరపాలక అధికారులు, కార్మికులు మృతుడికి నివాళులర్పించారు.


పారిశుధ్య కార్మికుడికి నివాళి అర్పిస్తున్న కమిషనర్

జాతీయ విద్యా విధానంపై సదస్సు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిధులు

ప్రజాశక్తి- గుడిపల్లి: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో జాతీయ విద్యావిధానం సెల్ కోఆర్డినేటర్ ఆచార్య డి.శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో 2047లో వికాసిత్ భారత్‌ను సాకారం చేయడంలో జాతీయ విద్యా విధానం 2020 పాత్రపై గురువారం కందుకూరి వీరేశలింగం ఆడిటోరియంలో ఒక రోజు జాతీయ సదస్సు ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఎం.దొరస్వామి మాట్లాడుతూ 2047 నాటికి దేశాన్ని స్వావలంబన, సంపన్న ఆర్థిక వ్యవస్థగా మార్చాలనేది ప్రభుత్వ దార్శనికత అన్నారు. ఆర్థిక వృద్ధి, సాంకేతిక మెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాజిక సాధికారత, స్థిరత్వం ఈ కార్యక్రమానికి ప్రమాణాలు అని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథి ప్రొఫెసర్ వి.కిరణ్‌కుమార్ విచ్చేయగా అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.శ్యామల కీలక ప్రసంగం చేశారు. ప్రొఫెసర్ డి.మురళీదరరావు, డాక్టర్ సతీష హెచ్‌కె కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమీర్ శర్మ రైతుల పక్షపాతి



సమీర్ శర్మ చిత్రపటానికి నివాళి అర్పించిన పారిశ్రామికవేత్తలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: చిత్తూరు జైన్ ఫామ్ ఫ్రెష్ ఉపాధ్యక్షులు సమీర్ శర్మ లేనిలోటు ఎవరు తీర్చలేరని ఆయన రైతుల పక్షపాతి అని పలువురు పారిశ్రామికవేత్తలు రైతులు అన్నారు. జైన్ ఫారం ఫ్రెష్ ఉపాధ్యక్షులు సమీర్ శర్మ జనవరిలో మరణించారు. ఈ సందర్భంగా చిత్తూరులోని సూర్యప్రతాప్ కళ్యాణ మండపంలో గురువారం ఆయన సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జైన్ ఫార్మ్ ఫ్రెష్ ఎండి ఆదాంగ్ జైన్ కంపెనీ హెడ్ రోహన్ షాతో పాటు పరిశ్రమ యజమానులు, ఫ్యాక్టరీ కార్మికులు రైతులు పాల్గొని షమీర్ శర్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని విజిలాపురం కస్తూరిబా గురుకుల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ పి.అమరావతి తెలిపారు. ఆరవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం మార్చి 22 నుండి ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

శాసనసభ కమిటీ ఆన్ పిటిషన్స్‌లో సభ్యులుగా ఎమ్మెల్యే గురజాల



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ 'కమిటీ ఆన్ పిటిషన్స్'లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణమరాజు ఛైర్మన్‌గా కమిటీ ఆన్ పిటిషన్స్ ఏర్పాటు చేశారు. ఇందులో సభ్యులుగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌తో పాటు మరో ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్పీకర్, శాసనసభ్యులకు అందిన ఫిర్యాదులపై జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారు. 2025-26 సంవత్సరానికి కమిటీని ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టిడిపి వర్గపోరుతోనే రామకృష్ణ హత్య..?



ప్రజాశక్తి- పుంగనూరు: తెలుగుదేశం పార్టీ మండల నాయకత్వంలో ప్రధానంగా వర్గపోరుతోనే రామకృష్ణ హత్యకు గురి అయ్యాడని నియోజకవర్గంలో ప్రధాన చర్చ నడుస్తుంది. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం గ్రామంలో తెలుగుదేశం కార్యకర్త రామకృష్ణ వైసీపీకి చెందిన వెంకటరమణ చేతిలో హత్యకు గురయ్యాడు. దీనికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీలో గ్రూపు రాజకీయాలేనని ఆలస్యంగా తెలియవస్తుంది. కృష్ణాపురం గ్రామంలో రామకృష్ణ తెలుగుదేశం పార్టీ రూరల్ అధ్యక్షునికి అనుచరుడు గాను, తెలుగుదేశం పార్టీలోనే మరో వర్గానికి అనుచరులుగా ఉండడంతో ఈ హత్యకు దారి తీసింది. గత 15 రోజుల క్రితం ఆ గ్రామంలో వైసీపీ తెలుగుదేశం పార్టీల మధ్య గొడవలు జరిగితే ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేసి వైసిపి వారిని పిలిపించుకొని తిరిగి పది నిమిషాలలో తిరిగి పంపి వేయడంతో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఆగ్రహించి రామకృష్ణ చేత వైసీపీ నాయకులతో ప్రాణభయం ఉన్నదని వారి నుంచి రక్షణ కావాలని వీడియో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఇదిలా ఉండగా తెలుగుదేశం పార్టీ కృష్ణాపురంకు చెందిన మరో వర్గం వారు అదే పార్టీలో మరో వర్గాన్ని కలవడంతో వైసిపి వారు మనకు మద్దతుగా ఉంటారని వారిని స్టేషన్ నుంచి పంపించాలని చెప్పడంతో ఆ నాయకుడు సిఐ శ్రీనివాసులుకు ఫోన్ చేసి వైసిపికి చెందిన వారిని వదిలి పెట్టాలని కోరారు. దీంతో సీఐ వారిని వెంటనే పంపించడంతో వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు వెనుకంజ వేయడంతో జరగవలసిన నష్టం జరిగిపోయింది. ఇదే అదునుగా భావించిన వైసీపీకి చెందిన కే.వెంకటరమణ, ఎస్.మహేష్, త్రిలోక్ నాయుడు, ఎస్.రజిని, ఎం.రెడ్డెప్ప రెడ్డి ఎప్పటినుండో రామకృష్ణ అంటే గిట్టని వీరు హత్యకు ప్రణాళిక వేసి వేట కొడవళ్లతో అత్యంత కిరాతకంగా రామకృష్ణను హత్య చేశారు. జరుగుతున్న ఈ విషయాలపై నియోజకవర్గ ఇన్చార్జ్ తెలిసిన స్పందించకపోవడంతో పార్టీకి జరగవలసిన నష్టం జరిగిపోయింది. ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి, సీఐ శ్రీనివాసులు సకాలంలో స్పందించి ఉంటే ఈ హత్య జరిగేది కాదేమో అని పలువురిలో చర్చ నడుస్తుంది. వైసీపీ కన్నా క్యాడర్ తక్కువగా ఉన్న టిడిపి పార్టీ బలోపేతానికి క్యాడర్ ఏర్పాటుకు చేసుకోవాల్సింది పోయి వర్గపోరుతో పంతాలు పట్టింపులకు పోతుంటే నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కావడం ప్రశ్నార్థకమే? ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పుంగనూరు నియోజకవర్గంలో వర్గాలకు స్వస్తిపలికి క్యాడర్ను తయారు చేస్తే పార్టీకి మనుగుడు ఉంటుంది లేదంటే వైసీపీకి కంచుకోటగా నిలిచిపోతుంది.

రియల్ ఎస్టేట్ చేసిన వారి పైన కేసులు

గత ఐదు సంవత్సరాలలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన వైసీపీ నేతలపై కేసులు నమోదు చేసింది కూటమి ప్రభుత్వం. అందులో భాగంగానే రామకృష్ణ హత్య కేసులో ఎలాంటి సంబంధం లేకపోయినా వైసీపీకి చెందిన మాజీ ముడా చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, యువత అధ్యక్షుడు చెంగారెడ్డిలపై హత్య చేసిన వెంకటరమణతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నిందితులు కబ్జాలు, ఆక్రమణలు, బెదిరింపులు ఘటనలో పాల్గొన్నట్లు ఆధారాలు ఉన్నట్లు వీటిపై కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసిన వైసీపీకి చెందిన నాయకులపై మరికొన్ని కేసులు నమోదయ్యే అవకాశమున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఆశాలకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి

డిఎం అండ్ హెచ్ఓకి సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆశా కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి కనీస వేతనాల అమలు చేయాలని గురువారం సిఐటియు ఆధ్వర్యంలో డిఎంఅండ్ హెచ్‌ఓకి వినత పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆశాల ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పాపులేషన్ ఎక్కువ ఉన్న ప్రాంతాలలో కొత్త ఆశ వర్కర్‌ను నియమించాలని, జిల్లాలో అదనపు పనులు చేయిస్తున్న మెడికల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని, ఆశాల విధివిధానాలు తెలియజేస్తూ జిల్లా అధికారులు సర్కులర్ జారీ చేయడంలో నిర్లక్ష్యం తగదని అన్నారు. ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన యూనిపాం నాణ్యంగా లేదని వేసవి కాలం ఇబ్బందికరంగా ఉంటుందని నాణ్యమైన యూనిఫాంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. గత ఏడు సంవత్సరాల ముందు కేంద్ర ప్రభుత్వం ఆశాలకి కేవలం 1000 రూపాయలు పెంచి తరువాత పెంచకపోవడం దారుణమన్నారు. కమ్యూనిటీ హెల్త్‌వర్కర్స్‌ను ఆశాలుగా గుర్తించాలని, ఆశాలకు దేశవ్యాప్తంగా ఒకే రకమైన పనిపద్ధతిలో ఉండాలని కోరారు. జిల్లాలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కారం కోసం జిల్లా అధికారులకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనురాధ, సుబ్బలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


డిఎం అండ్ హెచ్ఓకి వినతిపత్రం ఇస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

అంగన్వాడీలకు శిక్షణా తరగతులు


బైరెడ్డిపల్లిలో..

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాజెక్టులో మండలంలోని అంగన్వాడీలకు సిడిపిఓ అరుణశ్రీ ఆధ్వర్యంలో పోషణ్ బి పడావో బి శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభం అయ్యింది. ఈ శిక్షణా కార్యక్రమం మూడు రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందని మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలందరూ ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలని సిడిపిఓ తెలిపారు. పోషణ, విద్య, నవచేతనపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కెఆర్‌పిలుగా సూపర్వైజర్లు కె.రమాదేవి, వి.సుజాత, పి.రాధ, మాధవీలత పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: విద్యానాణ్యతను మెరుగుపరచాలని సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని మొగిలి మిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని మొగిలి, చీకురుపల్లి సెక్టార్‌లోని అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బి పడావో బి పై శిక్షణ తరగతులు సూపర్వైజర్లు జయ శ్రీ, రెడ్డి కళ్యాణి ఆధ్వర్యంలో ప్రారంభించారు.

కార్వేటినగరం: చిన్నారులలో శారీరక, మానసిక సామర్థ్యాలను పెంపొందించేలా అంగన్వాడీ కార్యకర్తలు చూడాలని సీడీపీవో పద్మసునంద అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బి పడావో బి అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్లు శామిని, ఇందిరా పాల్గొన్నారు.

సోమల: మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు గల చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు రప్పించడమే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రంలో ఆహ్లాదకర వాతావరణం పొందు పరచేందుకు అంగన్వాడి టీచర్లకు పోషణ్ బి పడావో బిపై శిక్షణ ఇస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత అన్నారు. మండల అభివృద్ధి కార్యాలయం సమీపంలోని సమావేశ మందిరంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు.

వెదురుకుప్పం: మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు స్థానిక ఎంపీడీవో మీటింగ్ హాల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం సిడిపిఓ పద్మ సునంద తెలిపారు. సూపర్వైజర్లు శకుంతల, భారతి, ఎంఈఓ మహేశ్వర్ పాల్గొన్నారు.


సోమలలో..

రొంపిచర్ల: పులిచెర్ల మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పోషణ్ బీ పడావో బీ అంగన్వాడీలకు శిక్షణ తరగతులను ఎంపీడీవో రాజశేఖర్ బాబు, ఎంఈఓలు సిద్దరామయ్య, పి.తాతయ్య ప్రారంభించారు. పర్యవేక్షణ అధికారి విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు. రొంపిచర్ల మండల కేంద్రంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమాన్ని రొంపిచర్ల ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష, ఎంఈఓ డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో..

అంతర్‌పంటలపై రైతులకు అవగాహన

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం: సాధికారిక సంస్థ అధికారి చంద్రశేఖర్



ప్రజాశక్తి- వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం: గంగాధర నెల్లూరు, ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం, పెనుమూరు మండలాల్లో క్షేత్ర పరిశీలనలో భాగంగా వేరుశనగ ప్రధాన పంటలలో అంతర పంటలు సరళ విధానాన్ని రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. గురువారం ఏటీఎం మోడల్, ఎ గ్రేడ్ మోడల్‌లు రిలేసోయింగ్ చేయాలని, 365 రోజులు పొలాన్ని కప్పివుంచాలని, పంటలు వైవిధ్యంతో సంవత్సరం పొడవునా భూమిని కప్పి ఉంచటం వలన భూమిలో సూక్ష్మ జీవుల వైవిధ్యంతో పాటు కలుపు నివారణ, చీడ పీడలు తగ్గడమే కాక కర్బనశాతం పెరిగి నేలలో తేమ శాతం పెరిగి నెలలో తేమను పట్టివుంచే గుణాన్ని కలిగి ఉంటుందని రైతులకు వివరించారు. కూరగాయలు, ఆకుకూరలు వైవిధ్య పంటలు, వాటి ఉపయోగాలు, రైతు ఆదాయం పెరిగే విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సకాలంలో ఆచరించాలని సూచించారు. ప్రాచీన వ్యవసాయం కాకుండా సాంకేతిక పరిశోధనలతో కూడిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలుగా పంటలు సరళి విధానంతో పంటలు విత్తుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు, రాష్ట్రస్థాయి రైతు సాధికార సంస్థ నుండి చంద్రశేఖర్ తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు హనుమంతు, ప్రతాప్, సీఆర్పీలు గణపతి, మణెమ్మ, జయారామన్, రైతులు జయచంద్రారెడ్డి, భాస్కరరెడ్డి, రేవతి పాల్గొన్నారు.

దుర్గాదేవి వైద్యసేవలు భేష్


డాక్టర్ దుర్గాదేవికి సన్మానం చేస్తున్న శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు పీహెచ్ సీలో నాలుగేళ్ళ పాటు డాక్టర్ దుర్గాదేవి పేద ప్రజలకు చేసిన వైద్య సేవలు భేష్ అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ దుర్గాదేవి పీజీ చదువు నిమిత్తం చిత్తూరు అపోలో ఆసుపత్రికి వెళ్ళనున్న నేపథ్యంలో ఆసుపత్రి సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించి ఆమెకు శాలువలు కప్పి గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. పీహెచ్సీ డాక్టర్ ప్రవీణ్ కుమార్, చిత్తూరు కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, రెడ్ క్రాస్ మండల ఛైర్మన్ పాపిరెడ్డి, సిహెచ్‌ఓ శ్రీనివాసులు, డీపీఎంవో కృష్ణన్, సూపర్ వైజర్లు ధర్మేంద్ర, షైలా, ఫార్మాసిస్ట్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి ఆహ్వానం



ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం పాతపేటలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మహా కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ కుప్పం ఆర్య వైశ్య సంఘం సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. కుప్పం శాసనసభ్యులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహా కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఆహ్వానపత్రికను అందజేసినట్టు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు.

సబ్సిడీ విత్తనాలను విత్తుకోవాలి

సహాయ వ్యవసాయ సంచాలకులు మజీద్ అహ్మద్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రైతులు సబ్సిడీ విత్తనాలను విత్తుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు మజీద్ అహ్మద్ అన్నారు. గురువారం మండలంలోని చికూరుపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం వ్యవసాయ అధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం పంపిణీ చేసిన ఉలవలను రైతులు భూముల్లో విత్తుకోవాలని రైతు సేవ కేంద్రంలో ఈ పంటను నమోదు చేసుకోవాలని, పంట తెగుళ్ళకు వచ్చిన వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, తగిన మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి కృష్ణవేణి, చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమా, వ్యవసాయ విస్తరణాధికారి సాధరయ్య, రైతు సేవాకేంద్రం సిబ్బంది ఎగువమూర్తి, సాయిజా పాల్గొన్నారు.

సస్యరక్షణపై అవగాహన




ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలం కూర్మాయి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో పురుగుమందుల పిచికారి, సస్యరక్షణపై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యం.ప్రదీప్, పురుగు మందును వినియోగించే విధానంలో మెళకువలను రైతులకు క్లుప్తంగా వివరించారు. పురుగు మందులు పిచ్చికారీ చేసేటప్పుడు సంరక్షణ దుస్తులు, చేతి తొడుగులు, అద్దాలను తప్పనీ సరిగా ఉపయొగించాలని చెప్పారు. ఉద్యాన విభాగం అధిఫతి డాక్టర్ పి.కార్తీక్ రెడ్డి పురుగు మందుల అవశేషాల వల్ల కలిగే నష్టాలను, పురుగుమందులను, స్ప్రేయర్స్ వినియోగించ్నే పద్ధతులను తెలియజేశారు. అనంతరం 30మంది రైతులకు పురుగుమందుల వినియోగించేటప్పుడు వాడాల్సిన మాస్కు, కళ్ళజోళ్ళు, చేతి తొడుగులు కిట్లను అందజేశారు. పలమనేరు వ్యవసాయ సమన్వయ అధికారి సంధ్య పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం..!

ప్రజాశక్తి - రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలోని రైతులు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఎస్.చలపతి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డ్రిప్ ఇరిగేషన్ లేనిదే వ్యవసాయానికి కష్టతరంగా మారినప్పుడు గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముందు చూపుతో ఇజ్రాయిల్ టెక్నాలజీ తీసుకువచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించారన్నారు. వ్యవసాయానికీ ట్రాక్టర్లు, పరికరాలు అందించి ప్రోత్సహించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి గోకులం షెడ్ల ద్వారా శరవేగంగా పనులు చేపట్టి శాశ్వత తాగు, సాగు నీటి పరిష్కారాన్ని చూపుతున్నారన్నారు. మామిడి రైతులకు సబ్సిడీ ద్వారా కవర్లు అందించారనీ రానున్న రోజుల్లో రైతుకు కావాల్సిన మౌసులు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

కందూరులో వీధి దీపాల ఏర్పాటు



ప్రజాశక్తి- సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ఈనెల 22, 23 తేదీలలో నిర్వహించనున్న గంగ జాతర పండుగను పురస్కరించుకొని గ్రామంలోను పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు వీధిదీపాల ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు తడి పొడి చెత్త వేరు చేస్తూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ చెత్త తొలగింపు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. జాతరను పురస్కరించుకొని మరింత శుభ్రంగా వీధులలోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చెత్తబుట్టలు పంపిణీ



ప్రజాశక్తి- కుప్పం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి కోరారు. గురువారం వారు చెక్కునత్తం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఆ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో దివ్యాంగుల సౌకర్యార్థం ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడానికి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ శిబిరంలో శనివారం కుప్పం పట్టణ, మండలానికి చెందిన గ్రామీణ ప్రత్యేక ప్రతిభావంతులు పాల్గొనాలని సూచించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ పంచాయతీ ప్రజలకు చెత్తబుట్టలను అందజేశారు. నాయకులు మునిరత్నం, దేవేంద్ర, బాలు, వెంకటాచలం, బీరప్ప, రాము, విఆర్‌ఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

నేడు సదరం క్యాంప్

ప్రజాశక్తి- గుడిపల్లి: 21వ తేదీ శుక్రవారం జరగబోవు సదరం క్యాంపును గుడుపల్లి మండల ప్రజలు ఉపయోగించుకోవాలని, అంగవైకల్యం కలిగిన వ్యక్తులు సదరం క్యాంపుకు వచ్చి అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలను పొందాలని మండల పార్టీ అధ్యక్షుడు టిఎం. బాబు నాయుడు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుప్పం ఏరియా హాస్పిటల్‌లో ఈ క్యాంపు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపుకు వచ్చేవారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు నాలుగు, జిరాక్సులు రెండు సెట్లు తీసుకుని వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

పలమనేరులో జాతీయ సదస్సు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీలలో భాగవతం భక్తి, తాత్వికత, సామాజికత అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు, సదస్సు సంచాలకులు డాక్టర్ ఈ.వాసు తెలిపారు. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొని పత్రసమర్పణ చేస్తున్నారని ఆసక్తి గల సాహితీ అభిమానులు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

దట్టమైన పొగతో

వాహన చోదకుల ఇక్కట్లు



పొగను చీల్చుకుంటూ వస్తున్న వాహనాలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ చుట్టుపక్కల ప్రాంతాలలో గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కనున్న ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో నిప్పు మంటలుగా మారి ఎండు గడ్డి కాలుతూ దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో దాదాపు గంటసేపు సోమల –సదుం మార్గంలో తిరిగే వాహనచోదకులు దట్టమైన పొగ రోడ్డుపై గాలికి వస్తూ ఉండడంతో పొగలో వాహనాలు నడుపలేక ఇబ్బందులు పడ్డారు. కొందరు గట్టిగా హారంలు కొడుతూ మరికొందరు హెడ్లైట్ వేసుకొని మెల్లగా పొగ చూరుకున్న ప్రాంతాన్ని దాటుకుంటూ ప్రయాణం సాగించాల్సి వచ్చింది.

ఈకేవైసీ తప్పనిసరి: తహశీల్దార్

ప్రజాశక్తి- సోమల: మండలంలోని రేషన్‌కార్డు కలిగిన కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా ఈనెల 25వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని తహశీల్దార్ బెన్నురాజ్ కోరారు. ప్రభుత్వం అందించే ఉచిత రేషన్ బియ్యం అందాలంటే ఈ కేవైసీ చేయించుకోవాలని, అలా చేయించుకొని పక్షంలో వారికి బియ్యం అలాట్మెంట్ కుదరదని, ఈ కేవైసీ చేయించేందుకు మండలంలోని చౌక దుకాణ డీలర్లు అందరూ కార్డుదారులకు తెలియజేసి వెంటనే ఈ కేవైసీ చేయించుకునే విధంగా చూడాలని తెలిపారు. ఆథరైజేషన్ కలిగిన చౌక దుకాణ డీలర్లు అందరూ తమ ఆథరైజేషన్ దరఖాస్తుతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందించాలని కోరారు. ముఖ్యంగా ప్రతి ఒక్క కార్డుదారుడికి రేషన్ బియ్యం అందేవిధంగా చౌక దుకాణ డీలర్లు ఈకేవైసీ చేయించాలని కోరారు.

పనులను పర్యవేక్షించిన ఎంపీపీ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎంపీపీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనంకు గురువారం పైకప్పు మోల్డింగ్ వేస్తున్న సందర్భంగా ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, సర్పంచ్ కొమ్ము వెంకటేష్ నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. భవనం నిర్మాణ పనుల్లో నాణ్యతగా ఉండేలా చూడాలని కాంట్రాక్టర్లును, మేస్త్రీలను ఎంపిపి ఆదేశించారు. మండల యూత్ ప్రెసిడెంట్ మహేష్, వార్డు నెంబర్ తబ్బు పాల్గొన్నారు.

గృహలబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం


ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండలంలో పక్కా గృహ నిర్మాణాలు చేపట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు స్థానిక గృహ నిర్మాణ శాఖ ఏఈ పృథ్వి గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గృహ నిర్మాణం చేపట్టిన ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 50,000 వేలు, ఎస్టీలకు ఒక్కొక్కరికి 75 వేలును ప్రభుత్వం అదనంగా మంజూరు చేస్తుందన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పక్కా గృహాలకు ప్రభుత్వం ఒక లక్ష 80 వేల రూపాయలను విడుదల చేసిందని, ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం దీనికి అదనమని తెలిపారు. మండలంలోని ఎస్సీ 289 మందికి, ఎస్టి 16 మందికి, బిసి 66 మందికి మొత్తం 371 మంది లబ్ధిదారులకు గాను 2.10 కోట్లు రూపాయలు ఈ అదనపు సాయం వస్తుందని చెప్పారు. ప్రభుత్వం సాయం అందిన గృహాలన్నిటిని మే నెల ఆఖరికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ అదనపు ఆర్థిక సాయం సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులు పక్క గృహ నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా నూతన గృహాలు నిర్మించుకోవాలనుకున్న లబ్ధిదారులు మీ ప్రాంతాల్లోనే గ్రామ సచివాలయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాసుబుక్కులు, కుల ధృవీకరణ పత్రం, సొంతస్థలం ఉన్న లబ్ధిదారులు జిరాక్స్ సమర్పించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు వెదురుకుప్పంలోని గృహనిర్మాణశాఖ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటామని సూచించారు.

రికార్డు స్థాయిలో వేలం ధర

పంచాయతీకి లక్షల్లో ఆదాయం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కొత్తపల్లి గ్రామ సచివాలయంలో స్థానిక సర్పంచ్ టీవీ ఆధ్వర్యంలో వేలంపాట జరిగింది. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి బాలరాజు ఈ వేలంపాటను నిర్వహించారు. వేలంపాటలో 30 మంది పాల్గొనడానికి ధరావత్తు పదివేల రూపాయలు చొప్పున చెల్లించారు. టిడిపి, వైసిపి ఇరువర్గాలు పోటాపోటీగా వారపు సంత వేలం పాటను పాడారు. రెండు లక్షల 35 వేల రూపాయలు హెచ్చుపాట నిర్ణయించారు. అత్యధికంగా తొమ్మిది లక్షల 15 వేల రూపాయలకు జయచంద్రారెడ్డి వేలంపాటను దక్కించుకున్నారు. గత ఏడాది ఈ సంతను 5 లక్షల30 వేలుకు పాడగా అంతకు ముందు సంవత్సరం ఒక లక్ష 16 వేలు మాత్రమే వేలం పాట పాడారు. వేలంపాట జరిగే చోట నగిరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజిద్ ఆధ్వర్యంలో కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, పాలసముద్రం ఎస్సై చిన్న రెడ్డప్ప, వెదురుకుప్పం ఎస్సై వెంకటసుబ్బయ్య టీములతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నడు లేనివిధంగా రికార్డ్ స్థాయిలో వారపు సంతకు ధర పలకడం మండలంలోని ఇదే మొదటిసారి.



పంచాయతీ కార్యదర్శికి నగదు చెల్లిస్తున్న జయచంద్ర రెడ్డి

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు న్యాయవాదుల సంఘం ఎన్నికలు గురువారం జరిగాయి. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎల్.భాస్కర్, వైస్ ప్రెసిడెంట్లుగా చంద్రశేఖర్, షరీఫ్ ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా భరత్, జాయింట్ సెక్రటరీగా రవి, ట్రెజరర్‌గా ఫమీద్ బాషా, లైబ్రరీ సెక్రటరీగా ఇబ్రహీం, లేడీ రిప్రజెంటేటివ్లుగా మహేశ్వరీ, స్పోర్ట్ అండ్ కల్చరల్ సెక్రటరీగా రంజిత్ షా ఎన్నికయ్యారు. పలమనేర్ నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు అభినందించారు.

సికిల్ సెల్ అనిమియా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- యాదమరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య కార్యకర్తలకు సికిల్ సెల్ అనిమియా కిట్లను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ట్రై (ఎస్టి) జనాభాలో అత్యధిక మందికి రక్తహీనత ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని అందువలన వారిలో రక్తహీనతను గుర్తించి తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా రక్త పరీక్షలు చేసే నిమిత్తం సికిల్ సెల్ కిట్లను షెడ్యూల్ ట్రైబ్ జనాభా ఉన్న ప్రాంతాల్లో రక్త పరీక్షలు చేసి వారికి ఉన్న రక్త పర్సంటేజ్‌ను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఎవరికైనా రక్తహీనత ఉంటే వారికి ప్రభుత్వం ప్రత్యేకమైన మందులు అందిస్తుందని వివరించారు. హెల్త్ సూపర్వైజర్లు సెల్వరాని, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.



రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం




ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో గురువారం రైతు ఉత్పత్తిదారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టిడిపి మండల అధ్యక్షుడు బాబు నాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ సంఘం ఐక్యమత్యంగా పనిచేస్తే నాబార్డ్ ద్వారా కోట్లు రూపాయలు రుణసదుపాయం పొందవచ్చునని తెలిపారు. అదేవిధంగా ఈ సంఘం ద్వారానే రైతులకు వ్యవసాయం చేయడానికి సహకారాలు పొందవచ్చు అని, కావున మండలంలోని రైతులందరూ ఈ సంఘంలో చేరి ఐక్యమత్యంగా ఉంటూ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణి, సర్పంచ్ గోపాల్, రామయ్య, రామచంద్ర పాల్గొన్నారు.

క్రైం న్యూస్

నగరిలో చైన్‌స్నాచింగ్

మహిళ మెడలోంచి తాళిబొట్టు లాక్కెళ్లిన దుండగులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి):



బైక్‌పై పారిపోతున్న దుండగులు

మహిళ మెడలోంచి తాళిబొట్టు లాక్కెళ్లిన సంఘటనల నగరి మున్సిపాలిటీ తిరుపతి రోడ్డు 7కే క్రికెట్ టర్ఫ్ వద్ద చోటుచేసుకుంది. బాధితురాలు భార్గవి తెలిపిన వివరాలమేరకు. గుండ్రాజుకుప్పం ఎఎడబ్ల్యుకు చెందిన ఆమె బ్యాంకు పనినిమిత్తం నగరి పట్టణానికి వెళ్లాల్సి ఉండటంతో గురువారం మరో మహిళతో కలిసి నడచి తిరుపతి రోడ్డుకు చేరుకొని అక్కడి నుంచి ఆటోలో బ్యాంకుకు బయలుదేరింది. పనిముగించుకొని మళ్లీ ఆటోలో టర్ఫ్ వద్దకు చేరుకొని ఊరికి బయలుదేరారు. అప్పటికే ఇద్దరు హెల్మెట్ వేసుకొని దారిపక్కనే ఆగివున్నారు. దారిలో వెళుతుండగా వెనుకనుంచి వేగంగా వీరిని దాటుకొని ముందుకెళ్లినవారు కొంతదూరం వెళ్లాక నిర్మానుష్య ప్రాంతంలో ఎదురుగా వచ్చి భార్గవి మెడలోని తాళి చైను పట్టుకు లాగాడు. ఆమె కూడా పట్టుకొని వారించగా కొట్టడానికి ఇనుపరాడ్ ఎత్తుకున్నాడు. దీంతో భయపడ్డ ఆమె పట్టువదలడంతో చైను లాక్కెల్లాడు. లాక్కెళ్లిన చైను తాళిబొట్టు, కాసులతో కలిపి సుమారు 24 గ్రాములు బంగారం అని బాధిరాలు తెలిపింది. కాగా వారు బైక్‌లో వెళ్లే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. దాని ఆధారంగా సీఐ విక్రమ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

నలుగురు అరెస్ట్, నగదు స్వాధీనం



ప్రజాశక్తి- గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. గుడిపాల ఎస్సై రామ్మోహన్ తెలిపిన మేరకు మండలంలోని వెప్పలమాను చేను, కొత్తపల్లి, కిల్లారిపల్లి, పిల్లారి కుప్పం, పాపసముద్రం, శ్రీరంగంపల్లి గ్రామాలలో పేకాట స్థావరాలపై తన సిబ్బందితో దాడులు చేయగా శరవనన్, అబ్బన్న, పృథ్వి, సురేష్ బాబు నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరితోపాటు ఉన్న నాగరాజు, గోపి, చంద్ర, ప్రవీణ్, గురుమూర్తి, శరత్, రవి ఏడుగురు పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో రూ.12,100లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



ప్రజాశక్తి- కార్వేటినగరం: గురువారం చిత్తూరు నుంచి పుత్తూరుకు వస్తున్న బస్సు కార్వేటినగరం కూత వేటులో జాతీయ రహదారిపై ఉన్నట్లుండి కల్వర్టు వద్ద పెద్దఎత్తున శబ్దం రావడంతో బస్సులోని ప్రయాణికులతో పాటు, స్థానికులు కూడా ఉలిక్కిపడ్డారు. అక్కడ ఎం జరిగిందో కొంత సమయం వారికి అర్థం కాలేదు. ప్రయాణికులు భయభ్రాంతులకు గురై బస్సు నుంచి దిగారు. తీరా చూస్తే బస్సు ముందు చక్రం పంచర్ అయినట్లు డ్రైవర్ గుర్తించారు. అయితే 5 అడుగుల దూరంలో పెద్ద కల్వర్టు ఉంది. అలాగే అదే ప్రాంతంలో 33 కేవీ విద్యుత్ స్తంభం ఉండటంతో పెనుప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తంగా బస్సును రోడ్డువైపు మళ్లించి ఆపడంతో పెనుప్రమాదం తప్పిందని ప్రయాణికులు, స్థానికులు తెలిపారు.



వెటర్నరీ విద్యార్థుల నిరవధిక సమ్మె విరమణ

ప్రజాశక్తి - క్యాంపస్

పశువైద్య విద్యార్థుల స్టైఫండ్‌ను ఇతర మెడికల్ కళాశాల విద్యార్థులతో సమానంగా పెంచాలని కోరుతూ గత 46 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెను బుధవారం రోజు ప్రభుత్వం జీవో విడుదలతో గురువారం అధికారికంగా పశువైద్య విద్యార్థుల సమ్మె విరమించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా. రవి, విసి డా. జే.వి. రమణ, ప్రిన్సిపల్ డా. జగపతి రామయ్య, యూనివర్సిటీ డీన్ డా. వీరబ్రహ్మయ్య లకు విద్యార్థుల ప్రతినిధులు తమ నిర్ణయాన్ని వివరించారు. ఈ సమ్మె నేపథ్యంలో వెటర్నరీ విద్యార్థులు అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి తమ స్టైఫండ్‌ను ఇతర మెడికల్ కోర్సుల విద్యార్థుల స్థాయిలో పెంచాలని డిమాండ్ చేశారు. అయితే, విద్యార్థుల డిమాండ్‌కు పూర్తిస్థాయిలో స్పందించకపోయినా, ప్రస్తుతం అందుతున్న స్టయిఫండ్ పై 50శాతం పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. విద్యార్థులు ఆశించిన స్థాయిలో స్టైఫండ్ పెరుగుదల లేకపోయినా, మంత్రి అచ్చెం నాయుడు మూడు నెలల్లో మళ్లీ సమీక్షించి మరింత పెంపు చేస్తామని హామీ ఇవ్వడంతో, విద్యార్థులు బాధతోనే సమ్మెను విరమించారు. ఇది శాశ్వత పరిష్కారం కాదని, ప్రభుత్వం మళ్లీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, వెటర్నరీ విద్యార్థులు మరింత తీవ్ర స్థాయిలో సమ్మెను పున్నప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

చేనేత కార్మికులకు ఉపాధి చూపాలి

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరి చేనేత చీరలకు ఉన్న ప్రతిష్ట, ఈ ప్రాంత ప్రజలకు లేదని, చేనేత కార్మికులకు ఉపాధి చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి అన్నారు. గురువారం 1, 2, 3 వార్డుల్లో బంగారుపేట ఏరియాలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. నూలు ధర తగ్గించాలని, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. మూడు రోజులకు ఒకసారి తాగునీరు వస్తోందన్నారు. మురుగునీటిలో తాగునీటిపైపులు ఉండటం వల్ల కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారన్నారు. స్మశాన స్థలం 11 ఎకరాలకు పైగా ఉండాలని, అయితే ఎక్కువ భాగం ఆక్రమణకు గురయ్యిందన్నారు. ఎంఎల్‌ఎ స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, ఐలా భాస్కర్, సుబ్బరాయులు, చంద్రశేఖర్, రత్నమ్మ, నారాయణ, రాజయ్య పాల్గొన్నారు.

– సత్యవేడు మండలం పేరడం గిరిజనులు మూడేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నా ఇంటిపట్టాలు ఇవ్వలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మెలుగు రమేష్, నాగరాజు, కృష్ణయ్య, సుశీల, నరసింహులు, ఏరమ్మ, గోవిందమ్మ, లక్ష్మమ్మ, రాణమ్మ, నాగమ్మ, కొల్లాపూర్ శాంతి పాల్గొన్నారు.



సిపిఎం ప్రజాచైతన్య యాత్రల్లో డిమాండ్



రేషన్ షాపును ఏర్పాటు చేయాలని ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి రూరల్ పరిధిలో ఉండే తనపల్లి ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని బియ్యం కార్డులతో సిపిఎం ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. రూరల్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, ఎం.నరేంద్ర, మునిరాజ్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా గాలికి వదిలేశారన్నారు. రేషన్‌షాపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. చిరంజీవి, యుగంధర్, మధు, గణేష్, శ్రీవాణి పాల్గొన్నారు.

టీటీడీలో ప్రమోషన్లపై నిషేధం ఎత్తేయాలి

సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానంలో గత నాలుగేళ్లుగా అనధికారికంగా కొనసాగుతున్న ప్రమోషన్లపై నిషేధాన్ని ఎత్తివేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. టీటీడీలోని అన్ని విభాగాలలో, అన్ని క్యాడర్లలో ప్రమోషన్లు గత నాలుగేళ్లుగా నిలిపేశారని, కారణాలను ఏ ఒక్కరూ తెలియజేయడం లేదని, తక్షణం అప్రకటిత నిషేధాన్ని తొలగించి టీటీడీలోని అన్ని కేడర్ల లోని పర్మినెంట్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతిని కల్పించాలని కోరారు. గురు, శుక్రవారాలలో ముఖ్యమంత్రి తిరుమల పర్యటన ఉన్న నేపథ్యంలో ఈ సమస్యపై సానుకూల నిర్ణయం చేసి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.